క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో అన్న సమారాధన



అన్న సమారాధనలో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, భోజనాలు అందించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో కేజీఆర్‌ఎల్ కళాశాల ఫార్మసీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం పర్యావరణం, ఆరోగ్య రక్షణ, పరిసరాలు పరిశుభ్రత తదితర వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీఆర్‌ఎల్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లేశ్వరుడికి లక్షపత్రి పూజ



చెన్నమల్లేశ్వరస్వామి

ఉండి: రాజులపేటలో వేంచేసియున్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామికి గురువారం లక్ష పత్రి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్ర హోమం, ఆదిత్యాది నవగ్రహ హోమాలు, స్వామివారికి అమ్మవారికి శాంతి కల్యాణం, నీరాజన మంత్ర పుష్పాలు, చతుర్వేద స్వస్తి, స్వామి వారి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. చిక్కాల జగదీష్, వరలక్ష్మి, రాఘవ, బురిడి రవిబాబు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



మొగల్లు రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

పాలకోడేరు: నిత్యం ప్రజలకు ఎన్నో సేవలందించే రోడ్డు రవాణా సంస్థ బస్సులు మరమ్మతులకు గురై ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గురువారం తణుకు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు భీమవరం నుంచి బయలు దేరి తణుకు వెళుతూ మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మోగల్లు వశిష్ట రొయ్యల కంపెనీ వద్ద ఆగిపోయింది. దీంతో ఏమిటా అని చూస్తే టైర్‌లో గాలి తగ్గిపోయిందని డ్రైవర్, కండక్టర్ తెలిపారు. వేరే బస్సు కోసం ఎదురు చూస్తున్నామని, దానిలో ప్రయాణికులను ఎక్కించేస్తామని చెప్పారు. అయితే గంటల తరబడి వేరే బస్సు కోసం నిరీక్షిస్తున్నామని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం రూరల్: రానున్న రెండు రోజుల్లో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిలకుమారి సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు కోసిన పంటను చేలల్లో విడచి పెట్టకుండా వెంటనే ఒబ్బిడి చేసుకోవాలన్నారు. వీలైతే తుఫాన్ అనంతరం వరికోత పనులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందని, రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలని కోరారు.

రైతుల్లో భయం భయం

- మళ్లీ దొరికిపోతామా !
- వాయుగుండం ప్రకటనతో అన్నదాతల్లో గుబులు



కోతకు వచ్చిన ఖరీఫ్ పంట

ఆకివీడు: మళ్లీ దొరికిపోతామా ! అంటూ వణికిపోతూ భయాందోళనలో ఖరీఫ్ రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, దీని ప్రభావం వల్ల పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించడంతో రైతుల్లో గుబులు మొదలైంది. ఖరీఫ్ సీజన్ ఆది నుంచి అవాంతరాలే కలుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. నారుమళ్ల దశలో కురిసిన భారీ వర్షాలకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. నాట్లు వేసిన తరువాత సంభవించిన భారీ వర్షాలు, వరదలకు నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో భారీ నష్టం కలిగింది. వరదలకు నియోజకవర్గంలో సుమారు రూ.2,600 పైగా ఎకరాల్లో పంట పూర్తిగా పాడైపోయింది. దెబ్బతిన్న చేలల్లో మళ్లీ నాట్లు వేసి సాగు చేశారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలోని ఉండి మండలంలో 10,749 ఎకరాల్లోనూ, పాలకోడేరు మండలంలో 11,200 ఎకరాల్లోనూ, కాళ్ల మండలంలో 3,220 ఎకరాల్లోనూ, ఆకివీడు మండలంలో 1868 ఎకరాల్లో ఖరీఫ్ పంట కోతలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో డిసెంబర్ మొదటి వారం నుంచి కోతలు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం పలుచోట్ల వరి మొక్కలు దిట్టంగా కంకులు వేసి, గింజ గట్టి పడే దశలో ఉంది. ప్రస్తుతం పాలకోడేరు మండలంలో 50 శాతం, ఉండిలో 30 శాతం, ఆకివీడు, కాళ్ల మండలాల్లో 20 శాతం కోతలు అయ్యాయి. ఈ పరిస్థితుల్లో వాయుగుండ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే చేతికందొచ్చిన పంట తుపాను పాలవుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నేల తాకితే నష్టమే

వాయుగుండ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తే వరి చేలు నేలకొరిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పూర్తిగా తయారైపోయి కంకులకున్న ధాన్యం గింజలు నేలకు తగిలితే, మొలకలొచ్చే ప్రమాదం ఉంటుందంటున్నారు. దేవుడు కరుణించాలని రైతులు వేడుకుంటున్నారు.

త్వరగా మాసూళ్లు చేయండి

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేసిన రైతులు కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలల్లో మాసూళ్లు చేపట్టి, ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు సూచించారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పంట కోతకు వచ్చిందన్నారు. డిసెంబర్ మొదటి వారంలో అధికంగా మాసూళ్లు జరగొచ్చని చెప్పారు.

అపార్ నమోదు వేగవంతంగా పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): అపార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు అడ్మిన్ సెక్రటరీలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలలు అపార్ ప్రక్రియను నమోదును నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదు ప్రక్రియ వెనుకబడి ఉన్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, బ్యాంకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి వి.అరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మత్స్య కార్మిక సంఘం నాయకులు

భీమవరం అర్బన్: ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న మత్స్యకారుల జీవన ప్రమాణాలు మారడం లేదని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు అన్నారు. భీమవరం మండలంలోని తోక తిప్ప గ్రామంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20,000లు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టి ఐదు నెలలు పైగా గడుస్తున్నా ఇప్పటివరకు మత్స్యకార భరోసా ఊసే లేదన్నారు. మత్స్యకారులను ఆదుకునేందుకు సబ్సిడీపై వలలు, బోట్లు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రావు, ఒడుగు శ్రీనివాసరావు, ఇంజేటి శ్రీనివాసరావు, తిరుమాని సత్యనారాయణ, తానేటి రవి, టి సత్యనారాయణ, కొల్లాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాస్కం ఫౌండేషన్‌తో ఎస్ఆర్‌కేఆర్ ఎంఓయూ



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చేందుకు సాంకేతిక సహాయం పొందేందుకు నాస్కం ఫౌండేషన్‌తో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎంఓయు కుదుర్చుకున్నట్లు కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. ఒప్పందం పత్రాలను నాస్కం ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ ఆల్బర్ట్ డైలాన్ కొర్రియా, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు గురువారం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ నాస్కం ఫౌండేషన్‌తో ఎంఓయూ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి ఉన్నతమైన పరిశోధనాత్మక ఆలోచనలు వాస్తవ రూపంలో తీసుకువచ్చేందుకు, స్టార్టప్‌లు పెట్టేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. వీటితోపాటు హేక్తాన్ వంటి కార్యక్రమాలకు కూడా మంచి సూచనలు సలహాలు కూడా ఎంఓయూ ద్వారా విద్యార్థులకు అందుతాయన్నారు. కళాశాల డీన్ అకాడమిక్స్ వి చంద్రశేఖర్, కళాశాల కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రజలను చైతన్యపరిచేవి కళారూపాలేనని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా గురువారం పట్టణంలోని చినరంగపాలెం మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు అభ్యుదయ గేయాల పాటల పోటీలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో ఇబ్బందులను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించాలంటే ప్రజా కళారూపాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. యువత ప్రజలను చైతన్య పర్చడానికి ప్రజా కళారూపాలను ఆయుధంగా తీసుకోవాలన్నారు. కళా రంజని వ్యవస్థాపకుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజానాట్యమండలికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని స్వతంత్ర్య సమయంలో ప్రజా కళాకారులు ప్రజల కోసం పని చేశారన్నారు. అనంతరం పాటల పోటీల్లో విజేతలైన పి సునీత, పి స్వాతి, సీహెచ్ వాసవిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కోడి వెంకటరావు, చాన్ బాషా, శ్యామలరావు, సుమ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు పోలీసు స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

పాలకోడేరు: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పేర్కొన్నారు. ఆయన గురువారం పాలకోడేరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటీవల నమోదైన రౌడీ షీటర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీపీ రోడ్‌లో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అవుతోందని, శృంగవృక్షం రైల్వే గేటు వేసినపుడు ట్రాఫిక్ జామ్ అయి గంటల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రశ్నించగా అవసరమైన చోట్ల సిబ్బందిని నియమిస్తానన్నారు. ఈయన వెంట భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్సైలు రవి వర్మ, హరిబాబు, భీమవరం రూరల్ ఎస్సై వీర్రాజు, సిబ్బంది ఉన్నారు.

ధర అమోఘం..పెంపకం పెనుభారం



శీతల్ చేపలు

ఆకివీడు: శీతల్ చేపల ధర అమోఘం.. పెంపకం మాత్రం పెనుభారమని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. తెరచాపగా ఉండే ఈ చేప మాంసం ముద్దలను ముట్టకోదు. కాని బతికున్న చిరు చేపలను మాత్రమే తింటుంది. ఉప్పు, చప్ప నీటిలో పెరిగే ఈ చేప సముద్ర తీర ప్రాంతాల్లో లభిస్తుంది. ఖరీదైన ఈ చేప పశ్చిమ బెంగాల్ ప్రజలు శీతల్ రుచి అమోఘమని, అమితంగా ఇష్టపడతారు. దీనికి సంబంధించిన పిల్లల ఉత్పత్తి కేంద్రాలు (హేచరీలు) కూడా ఆ పశ్చిమ బెంగాల్‌లోనే ఉన్నాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. చెరువుల్లో పెంచేందుకు తగినంత సీడ్, ఫీడు అందుబాటులో ఉండదని, దీని పెంపకం అత్యంత కష్టమని చెబుతున్నారు. చేప ధర కూడా అధికమే. కిలో రూ.300 పైబడి ఉంది. రెండు కేజీల నుంచి ఐదు కేజీల వరకు ఈ చేపలు పెరుగుతాయి

గొరసలను తినేందుకు చెరువుల్లో..

చేపల పెంపకానికి పెద్ద తలపోటుగా ఉన్న చైనా గొరసను ఖతం చేసేందుకు రైతులు శీతల్ చేపను ఆయుధంగా మలుచుకుంటున్నారు. 100 గ్రాముల పైబడి తెల్ల చేపల పెంపకం వేసిన చెరువుల్లో ఎకరాకు 10 నుంచి 20 వరకూ చిన్న సైజు శీతల్ చేపలను వేస్తున్నారు. చెరువుల్లో నీటి ద్వారా వచ్చే చైనా గొరస చేపల చెరువుల్లో విపరీతంగా పెరిగిపోతుంది. చేపలకు వేసే మేతను అధికంగా చైనా గొరసలు తినేసి రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. వీటి నివారణ రైతులకు పెద్ద తలపోటుగా మారింది. పట్టుబడి సమయంలో శీలావతి, కట్ల చేపల కంటే అధికంగా చైనా గొరస వలలకు చిక్కడంతో రైతులు బిక్క ముఖం వేస్తున్నారు. వీటిని అంతమొందించేందుకు ఆయుధంగా శీతల్ చేపలను వదులుతున్నారు. చిన్న పిల్లగా ఉన్న చైనా గొరసలను శీతల్ చేప తినేస్తుంది. ఈ విధంగా లైవ్‌ఫిష్‌ను మింగేస్తున్న శీతల్ చేప పట్టుబడి సమయానికి మూడు కేజీల నుంచి ఐదు కేజీల పైబడి ఎదుగుతుంది. చైనా గొరస కన్నా దీని పెంచడం వల్ల మేత ఆదా కావడమే కాకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని కొంత మంది రైతులు చెబుతున్నారు.

మోటారు సైకిల్ ఢీకొని ముగ్గురికి గాయాలు

భీమవరం: స్కూల్ నుంచి తన కుమారుడిని మోటారు సైకిల్‌పై తీసుకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరొక మోటారు సైకిల్ ఢీకొనడంతో భార్య, భర్తలు, కుమారుడు గాయపడ్డారని భీమవరం టుటౌన్ ఎస్ఐ రెహమాన్ గురువారం చెప్పారు. పట్టణంలోని బలుసుమూడికి చెందిన జి మోహన్‌రవితేజ కుమారుడు ఇవాన్ పెదఅమిరంలోని ప్రైవేటుస్కూల్లో చదువుతుండడంగా బుధవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చేందుకు మోహన్‌రవితేజ అతని భార్య నమ్రత కృష్ణ మోటారు సైకిల్‌పై వెళ్లి ముగ్గురు తిరిగి వస్తుండగా చినఅమిరం గ్రామం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మరొక మోటారు సైకిల్‌పై గోనె సంచులతో వస్తున్న వ్యక్తి మోహన్‌రవితేజ మోటారుసైకిల్‌కు ఢీకొనడంతో ముగ్గురు కింద పడి గాయాలపాలయ్యారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహమాన్ చెప్పారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే మన మేధస్సు అంత పెరుగుతుందని తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ శాఖా గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గా కిషోర్ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి శాంతకుమారి మాట్లా డుతూ గత 40 ఏళ్లుగా గ్రంథాలయానికి సొంత భవనం లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఎక్కడైనా స్థలం ఏర్పాటుచేసి గ్రంథాలయ భవనం నిర్మాణం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాలకొల్లుకు చెందిన కవయిత్రి, సినీ గేయ రచయిత్రి పప్పొప్పు విజయలక్ష్మి (కె. భాగ్యలక్ష్మి)ని సత్కరించారు. కవులు చేగొండి రంగారావు, కొలాటి పెద్దిరాజు, కొల్లాబత్తుల సూర్యకుమార్, వై.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి



కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు

ఉండి: వరి సాగులో ఉత్తమ వ్యవసాయ పద్ధతులే మేలని ఆకివీడు సబ్ డివిజన్ ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉండి మండలం యండగండిలో జీఏపీ పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎప్పుడూ మేలైన పద్ధతులనే అవలంభించాలన్నారు. సాంప్రదాయ సాగు పద్ధతులను విడిచిపెట్టి వ్యవసాయాధికారుల ద్వారా సాగులో వచ్చే మార్పులు చేర్పులను రైతులు తెలుసుకుని వ్యవసాయం చేస్తే మరింత లాభదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం యండగండి ఉత్తమ రైతు యిందుకూరి వెంకట నరసింహరాజు (హరిబాబు) జీఏపీ వరి క్షేత్రంలో పంటకోత ప్రయోగం నిర్వహించి నమూనాను సేకరించి జీఏపీ సర్టిఫికేషన్ కోసంపంపించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ పొలంబడి రైతులు,గ్రామ రైతులు,ఏఈవో,వీపీఏలు పాల్గొన్నారు.

ఎంపెడా సదస్సులను సద్వినియోగం చేసుకోండి



ఎంపెడా అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఈనెల 18 నుంచి 24వరకు ఏఎంఆర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఏజీసీ సభ్యుడు ఎం. యోగీంద్రకుమార్ తెలిపారు. గురువారం మత్స్యపురిలో ఎంపెడా ఏర్పాటు చేసిన సదస్సులో యోగీంద్రకుమార్ మాట్లాడుతున్న ఏఎంఆర్ వ్యాప్తిని నిరోధించడానికి ఉత్తమ పద్ధతులను ప్రోత్సహిస్తుందన్నారు. 18 రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఏఎంఆర్‌పై ప్రచారాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ ఎన్‌సీఎస్ఏ ఫీల్డ్ మేనేజర్ ఏ.భువన, ఎన్.పి చంద్రశేఖర్‌లతో పాటు జేటీఓ డాక్టర్ ఎ ఆనంద్‌కుమార్, కృష్ణా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సురేష్ కుమార్, భీమవరం ఎఫ్‌డిఓ పి లవణయ్య, ప్రగతిశీల రైతు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సొమ్ముపై సమగ్ర విచారణ చేయాలి



జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న భీమారావు, కార్మికులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో విధుల్లో ఉన్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సొమ్ము అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో గురువారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన పీఎఫ్ సొమ్ము ఏడాదికిపైగా వారి ఖాతాల్లో జమకావడం లేదని, సదరు కాంట్రాక్టరు దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కార్మికుల బ్యాంక్ ఖాతాలకు పీఎఫ్ సొమ్ము జమ చేస్తున్నానని కాంట్రాక్టరు చెబుతున్నారని, కానీ వాస్తవానికి ఆ సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు జమ కావడం లేదని స్పష్టం చేశారు. తక్షణమే అధికారులు దీనిపై విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణకు పారిశుద్ధ్య కార్మికుల తరపున వినతిపత్రాన్ని భీమారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి ధర్మాని పుష్పలత, ఎం.వెంకటలక్ష్మి, వై.రత్నం, పి.విజయలక్ష్మి, నేకూరి లక్ష్మి, చింతాలు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వాకు దమ్మున్న వంగడాలివే

ఉధృతిగా శ్రీధృతి సాగు



దాళ్వాలో సాగు చేసిన ఎంటీయూ 1121 (శ్రీధృతి) (ఫైల్)

ఆకివీడు: దాళ్వా సాగుకు రైతన్నలు సన్నాహాలు చేస్తున్నారు. అధిక దిగుబడులు, చీడ పీడలను తట్టుకునే వంగడాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వరిసాగు చేసే పంటల్లో విత్తన ఎంపిక అతి ముఖ్యమైనది. దాళ్వాలో చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే వరి వంగడం ఎంటీయూ 1121 (శ్రీధృతి)ని రైతులు అధికంగా సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మార్టేరు వరి పరిశోధనా సంస్థ నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు అనువైన వంగడంగా 1121ని రూపొందించారు. ఎకరాకు 45 బస్తాల నుంచి 55 బస్తాలకు పైబడి దిగుబడిని ఇస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 62 బస్తాల దిగుబడి ఇచ్చిన సంఘటనలు కూడా ఉన్నాయి. మధ్యస్థ సన్నంగా ఉన్న ఈ రకం బియ్యాన్ని స్థానిక ప్రజలు కూడా వినియోగించడానికి అనువుగా ఉంటాయి. దాళ్వా సాగులో కాటన్ దొర సన్నాలుగా పేరొందిన మార్టేరు వంగడం 1010 రకం దిగుబడులు కూడా సంతృప్తికరంగా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. వీటితోపాటు ఎంటీయూ 1153, 1156, 1210, 3626 రకాలు, నెల్లూరుకు చెందిన ఎన్ఎల్ఆర్ 3449, ఐఆర్ 64, ఎన్ఎల్ఆర్ 3354 రకం వంగడాలు దాళ్వా సాగుకు అనువైనవి. రైతులకు అవసరమైన వరి విత్తనాలను 50 శాతానికి పైగా రైతులు సొంతంగానే సాగు చేసుకుని, నాణ్యమైన వంగడాలను రూపొందించుకుంటున్నారు. వచ్చే ఖరీఫ్ సాగుకు దాళ్వా సాగులోనే విత్తనాల సాగు చేపడుతున్నారు. ఖరీఫ్‌లో ఎంటీయూ 1318 రకం వంగడాన్ని అధికంగా సాగు చేయనున్నారు. చౌడును తట్టుకునే ఎంటీయూ 1290, ఎంసీఎం 103 వంగడాలను కూడా అక్కడక్కడా సాగుచేసి మంచి ఫలితాలను సాధిస్తున్నారు.

ఉమాసిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు

అత్తిలి: కార్తీకమాసం సందర్భంగా అత్తిలిలో ఉమాసిద్ధేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సుందరకాండ పారాయణం, రుద్ర హోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు. కొరిపల్లి హరి, ఫణికుమారి దంపతులచే శాంతి కల్యాణం జరిపారు. ఆలయ అర్చకులు అయిలూరి రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తణుకు అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఉడతల యమునా శ్రీలక్ష్మికి హైదరాబాద్‌కు చెందిన కారంకి ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యుడు వీరమల్లు ఫణీంద్రకుమార్ తెలిపారు. ఫౌండేషన్ నాయకులు కారంకి వెంకట శివనారాయణ పంపిన రూ. 60,602 చెక్కుతో పాటు సుబ్రహ్మణ్యం అందజేసిన రూ. వెయ్యితోకలిపి మొత్తం రూ. 61,602లు బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. జైఆంధ్ర గౌడ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ నంగెడ్డ రంగారావు, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం గౌడ్ పాల్గొన్నారు.